క్లుప్తంగా

12న రక్తదాన శిబిరం

దాబాగార్డెన్స్ : సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ జోజిబాబు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని 12న ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించనున్నా రని పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ సూర్యారావు, కోండ్ర రామకృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంట ల వరకు స్కూల్ ఆవరణలో నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో పూర్వ విద్యార్థులు పాల్గొనా లని కోరారు. గణేష్ వాయిపుత్ర సమన్వయకర్తగా వ్యవహరించనున్నారని చెప్పారు. రక్తదానం చేసేందుకు 8885203519 లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

యువత రక్తదానం చేయాలి



రక్తదాన శిబిరంలో దాతలు

దాబాగార్డెన్స్: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న ముగ్గురిని కాపాడవచ్చని సన్ ఇన్‌స్టిట్యూట్ సీఎండీ శ్రీకాంత్ జాస్తి, రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ప్రతినిధి ఆర్‌టీఎన్‌కేఆర్‌బీ ప్రకాష్ తెలిపారు. సన్ ఇంటర్నేషనల్, రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రక్త నిల్వలు తగ్గుతున్నాయని చెప్పారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని రక్షించవచ్చని పేర్కొన్నారు. యువత సైతం రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శతాధిక రక్తదాత కేఆర్‌బీ ప్రకాష్‌ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ రాజా బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది, సన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశాజాస్తి తదితరులు పాల్గొన్నారు.


అక్రమంగా బడ్డీ ఏర్పాటు



కళా ఆస్పత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన బడ్డీ

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డులోని కళా హాస్పిటల్ ఎదురుగా అక్రమంగా బడ్డీ ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ మరింత జటిలంగా మారింది. ఇప్పటికే ఈ ఆస్పత్రి రోడ్డులో బడ్డీలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య పెరిగింది. ఈ విషయంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బడ్డీలు వెంటనే తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

అంతర్జాతీయ పోటీలకు భీమిలి విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు, కోచ్

భీమునిపట్నం: విశాఖలో నిజీ షోటోకాన్ దూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే అంతర్జాతీయ కరాటే పోటీలకు భీమిలికి చెందిన షాడో షోటోకాల్ కరాటే దూ అసోసియేషన్ విద్యార్థులు వి.సుశాంత్, కె.మోహన్‌శ్రీ, సీహెచ్.శివరాం ఎంపికయ్యారు. ఈ మేరకు చీఫ్ కోచ్ ముగడ రమణయాదవ్ మంగళవారం వీరిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో వీరు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంతో ఇప్పుడు అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

కన్వీనర్లు, గృహ సారథులదే ఆ బాధ్యత



కన్వీనర్లు, గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తదితరులు



క్లస్టర్ సమావేశంలో పాల్గొన్న కన్వీనర్లు, గృహ సారథులు

- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రతీ కుటుంబానికి వివరించాలి
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసే బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులదే అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతీ కార్యక్రమాన్ని ప్రతీ కుటుంబానికి వివరించాలని సూచించారు. మహారాణిపేటలోని అంబికాబాగ్ రామాలయ కల్యాణమండపంలో నియోజకవర్గ సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు వీసం రామకృష్ణ, పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్‌తో కలిసి నిర్వహించారు. తొలివిడతగా మంగళవారం ఉదయం 27, 31, 32, 42 వార్డులు, మధ్యాహ్నం 33, 34, 35, 41 వార్డుల పరిధిలోని సచివాలయాల గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశమై, పలు సూచనలు చేశారు.

పేదలకు భరోసా ఇస్తున్న ప్రభుత్వం

అర్హతనే ప్రామాణికంగా చేసుకుని వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి పేదలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నా రు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరికీ లబ్ధిని చేకూరుస్తున్నారన్నారు. పేదలకు ఉన్నత విద్యను అందించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. విద్యాలయాలను కార్పొరేట్ స్థాయికి చేర్చి, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక తదితర పథకాలతో తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్నారన్నారు.

మహిళల ఆర్థిక ఉన్నతికి, సాధికారతకు ఎంతో చేయూతనిస్తున్నారన్నారు. అన్నదాతల నుంచి చిరు వ్యాపారుల వరకు అందరికీ అండగా నిలుస్తున్నారన్నారు. ప్రతీ కుటుంబానికి ఈ విషయాలను వివరించాలని సూచించారు. సంక్షేమ పథకాలను కొనసాగించాలంటే అందరూ జగనన్నకు అండగా నిలవాలని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, రెల్లి కుల కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, ద్రోణంరాజు శ్రీవత్సవ్, కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, కార్పొరేటర్లు బిపిన్‌కుమార్‌జైన్, అల్ల లీలావతి, తోట పద్మావతి, విల్లూరి భాస్కరరావు, కోడిగుడ్ల పూర్ణిమ, కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, పార్టీ వార్డు అధ్యక్షులు సర్వేశ్వర రెడ్డి, మూలే రామిరెడ్డి, బత్తిన నవీన్‌కుమార్, దొడ్డి బాపూ ఆనంద్, రంధి గోపి, మైఖేల్‌రాజు, పీతల వాసు, కనకరెడ్డి, నాయకులు రామానంద్, మన్యాల శ్రీనివాస్, సురపతి అప్పన్న లండా రమణ, లింగం శ్రీనివాస్, పాల శ్రీహరిరెడ్డి, ఆదివిష్ణు, బోని దేవా తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్సీ కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగులకొండ ఆశ్లేషచారి

దాబాగార్డెన్స్ : విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నాగులకొండ ఆశ్లేషచారి మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన పాదయాత్రలో కలిసిన విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్సీ సీటు కేటాయిస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు బి.ఉమామహేశ్వరరావు, అలమండ శ్రీనివాసరావు, సూర్యాచారి, గంగారామ్, కిల్లంపల్లి ఆచారి, మరడాన నాగేశ్వరరావు, గోడి అరుణ, గోవిందరావు, జేజుబాబు తదితరులు పాల్గొన్నారు.

మహారాణిపేట తహసీల్దార్‌గా ఆనంద్‌కుమార్

మహారాణిపేట: మహారాణిపేట తహసీల్దార్‌గా జి.ఆనంద్‌కుమార్ నియమితులయ్యారు. మహారాణిపేట తహసీల్దార్‌గా పని చేసిన రమామణికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి రావడంతో ఈ పోస్టు ఖాళీ అయింది. ఆ స్థానంలో ఆనంద్‌కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన సీసీఎల్ఏలో పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి



వెలంపేట వద్ద శిథిలమైన కాలువను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: వార్డులో సమస్యలు సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. వార్డులో కల్వర్టులు, రహదారి నిర్మాణాలను పరిశీలించారు. వెలంపేట, లక్ష్మీనగర్, పూలసందు వద్ద శిథిలమైన కల్వర్టులను పరిశీలించారు. వాటిని వెంటనే నిర్మిస్తామని చెప్పారు. స్మార్ట్ సిటీ ప్లాన్ కింద పాఠశాల భవనాలు, నిర్మాణాలు తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. పార్టీ నాయకులు నాయిని మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

భర్తను అప్పగించాలని వేడుకోలు



మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు

దాబాగార్డెన్స్: తన భర్త రెండు నెలలుగా కనిపించడం లేదని అల్లిపురం వేంకటేశ్వరమెట్ట ప్రాంతానికి చెందిన తాటిపూడి మహేశ్వరి వాపోయింది. ఈ విషయమై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని మీడియాను ఆశ్రయించింది. ఈ మేరకు మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో తన గోడు వెలిబుచ్చింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం... పార్వతీపురం ప్రాంతానికి చెందిన మహేశ్వరి తండ్రి 30 ఏళ్ల కిందట చనిపోవడంతో తల్లి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి విశాఖ చేరుకున్నారు. అల్లిపురం వేంకటేశ్వరమెట్ట వద్ద తల్లితో నివసిస్తూ సమీపంలోని గాజుల షాపులో మహేశ్వరి పని చేసేది. ఈ క్రమంలో ఆమెకు పెందుర్తి చిన్నతాడివలస ప్రాంతానికి చెందిన అశోక్‌తో పరిచయం ఏర్పడి, అది శారీక బంధానికి దారి తీసింది. తర్వాత పెళ్లికి అశోక్ ముఖం చాటేయడంతో ఆమె పెద్దలను ఆశ్రయించగా రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. వీరికి ఐదేళ్ల పాప సంతానం. ఈ క్రమంలో రెండు నెలల కిందట వేరే మహిళ నుంచి ఫోన్ వచ్చిందని, అప్పటి నుంచి అశోక్ కనిపించకుండా పోయాడని మహేశ్వరి వాపోయింది. ఈ విషయమై పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగలేదని, ఇప్పటికైనా నా భర్తను అప్పగించాలని ఆమె వేడుకుంది.

నిషేధిత ప్లాస్టిక్ ఉపయోగిస్తే చర్యలు



వైన్‌షాపులో అపరాధ రుసుము విధిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగిస్తే చర్యలు తప్పవని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన జోన్ పరిధిలో వాణిజ్య సముదాయాలు, వైన్‌షాపులను పరిశీలించారు. మద్యం దుకాణాల్లో ఆక్రమంగా ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ గ్లాసులను పట్టుకున్నారు. రూ.10 వేల అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే చాలా మంది గుడ్డ సంచులు వినియోగిస్తున్నారన్నారు. ఇప్పటికీ కొన్నిచోట్ల అడ్డదారిలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు విక్రయిస్తున్నారని మండిపడ్డారు. ఎవరైనా పాలిథిన్ కవర్లు విక్రయించినా, గొడౌన్లల్లో నిల్వ చేసినట్లు తనిఖీల్లో పట్టుబడినా ఆయా దుకాణాల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతోపాటు సీజ్ చేస్తామని జెడ్సీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో ఎన్.కిశోర్, శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సిరుల తల్లికి స్వర్ణ పుష్పార్చన



స్వర్ణపుష్పార్చనలో పాల్గొన్న ఉభయదాతలు



లక్ష కుంకుమార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8గంటల వరకు జరిపించిన అష్టదళ పద్మారాధనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన

నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం లక్ష కుంకుమార్చన ప్రత్యేక పూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ట్రస్ట్ బోర్డ్ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సహస్ర తులసి పూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 9న గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే దంపతులు రూ.1500 పూజా రుసుం చెల్లించి, పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి



ప్రజా దర్బార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

మహారాణిపేట : మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని మత్స్యశాఖ జేడీ విజయను విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశించారు. ఫిషింగ్ హార్బర్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేటకు వెళ్లే ట్రాలీ ఫిషింగ్ బోట్లును మార్చుకోవడానికి ప్రభుత్వం రూ.17 లక్షల సబ్సిడీ అందించాలని మత్స్యకార సంఘాల నాయకులు వాసుపల్లి జానకీరామ్, వీరన్న, బర్రి కొండబాబు కోరారు. దీనిని పరిశీలించాలని ఎమ్మెల్యే వాసుపల్లి అధికారులను కోరారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు రాజేష్, వీరన్న, లక్ష్మణ్, కింగ్‌ఫిషర్ రాజు, ఎం.బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు రామరాజు, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ పరిశుభ్రత అందరి బాధ్యత

పరిరక్షణకు నలుగురు గార్డుల నియామకం



బీచ్‌లో ఏర్పాటు చేస్తున్న ప్రజామరుగుదొడ్డి

జగదాంబ: బీచ్ పరిశుభ్రత అందరి బాధ్యత అని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.కిశోర్ అన్నారు. నగర సుందరీకరణలో భాగంగా తీరప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జీవీఎంసీ జోన్–4 పరిధి జాలారిపేట దరి నేవల్ క్యాంటీన్ వద్ద బీచ్‌లోనే మల, మూత్ర విసర్జన చేయడంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా ఉండడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోందన్నారు. దీంతో పర్యాటకులు , స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బీచ్‌లో మల, మూత్ర విసర్జన చేయవద్దని కోరారు. పర్యావరణ పరిరక్షణ, పర్యాటకుల సందర్శనల నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, ప్రజల సౌకర్యార్థం నేవల్ క్యాంటీన్ వద్ద ఉన్న సులభ్‌కాంప్లెక్స్‌ను ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా వాడుకలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంతేకాకుండా బీచ్ పరిరక్షణకు నలుగురు గార్డులను కూడా నియమిస్తున్నామన్నారు. ప్రజలు కూడా బీచ్ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో విశాఖ సత్తా

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశాఖ విద్యార్థులు సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి పర్సంటైల్ సాధించారు. విశాఖ ఖ్యాతిని చాటి చెప్పారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను అభినందించాయి.

నారాయణ ప్రభంజనం

సీతమ్మధార: జేఈఈ మెయిన్–2023 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని సంస్థ డీజీఎం హనుమంతరావు, డీన్ జి.రామలింగేశ్వరరావు తెలిపారు. తమ సంస్థ విద్యార్థులు పి.తేజశ్రీ 99.986295, ఎంవీవీ హర్షవర్ధన్ 99.9856388, ఎల్.అనన్య 99.9642468, సీహెచ్ వెంకట యశ్వంత్ 99.9409876, పి.బాలాజీ అభిషేక్ 99.9339384, ఎం.అనుశ్రీ 99.9248252, వి.యశస్వినాయుడు 99.9244526, ఎం.సుభాసివర్మ 99.9231306, ఎస్.మౌనిషా నాయుడు 99.9071369, పి.సాత్విక 99.9054354 పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ఈ ఫలితాల్లో 56 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ కంటే అధికంగా సాధించారని వెల్లడించారు. విద్యార్థులు, అధ్యాపకులను డీజీఎం, డీన్ అభినందించారు.

ఫలితాల్లో తిరుగులేని శశి

తగరపువలస: సంగివలస శశి విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో అత్యధిక పర్సంటైల్ సాధించినట్టు ఆ విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. కె.అభిరామ్ 99.89, బి.కావ్య 99.84, పి.సాయిరాం 99.75, ఆర్.సాయినారాయణ 99.61, ఎం.నాగదుర్గా సతీష్ 99.57, కె.సాయికృష్ణ రమేష్ 99.33, డి.వి.వి చైతన్య 99.28, వి.శ్రీసూర్య గుణ్వంత్ 99.14, ఎ.రంజిత్‌కుమార్ 99.14, ఇ.గౌతం ధీరజ్ 99.01 పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే 99 పైన 10 మంది, 98 పైన 20 మంది, 97 పైన 33, 96 పైన 41, 95 పైన 48 మంది పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, డైరెక్టర్ మేకా క్రాంతి సుధ అభినందించారు.

శ్రీ చైతన్య హవా..

విశాఖ విద్య: జేఈఈ మెయిన్ ఫలితాల్లో విశాఖ శ్రీ చైతన్య ఐఐటీ అకడామీ విద్యార్థులు సత్తా చాటారు. ఎం.ప్రశాంతి శ్రీజ, ఎస్.అనిరుధ్, ఎస్.సిద్ధార్థ, రహమాన్ షేక్ జమీల్, డి.సాకేత్ నాయుడు, కె.శ్రీ కార్తిక్, జి.హరిచరిణి, ఆర్.మోహిత్ నాయుడు 99 పైగా పర్సంటైల్ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ తెలిపారు. విద్యార్థులను సంస్థ డీన్లు ఎన్.రఘుకుమార్, కె.బంగారు బాబు, జె.సత్యనారాయణ, పి. సత్యనారాయణ అభినందించారు. అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని అభినందించారు.

శ్రీవిశ్వ విజయకేతనం

సీతంపేట: జేఈఈ మెయిన్–2023 ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించారు. సీహెచ్.ప్రతీష్ 99.61 పర్సంటైల్, బి.తనూజ 99.33, ఎ.మహర్షి 99.27, బి.కార్తీక్ శశాంక్ 99.25, ఎల్.హేమంత్ 99.25 పర్సంటైల్ సాధించారు. ఐదుగురు విద్యార్థులు 99 పర్సంటైల్ పైగా, 18 మంది విద్యార్థులు 98 పర్సంటైల్ పైగా సాధించినట్లు శ్రీ విశ్వ విద్యా సంస్థల కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

ఫిట్జీ విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఫిట్జీ వైజాగ్ సెంటర్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. షేక్ ఆవేజ్ మెహతాబ్ 99.96, నితిల్ కవిన్ 99.96, పీలా రత్న హర్ష 99.93, ఆయుష్ మార్తాండ్ బోర్కర్ 99.88, పెండెల హర్షిత్ 99.85, యు.ఎల్.ఎస్.ఎస్.వైభవ్ 99.85, రూపేష్ మల్లిరెడ్డి 99.82, ఆనంద్ సిద్ధార్థ్ 99.32 పర్సంటైల్ సాధించారని సెంటర్ హెడ్ పెండేల మస్తాన్‌రావు తెలిపారు. ఫిట్జీ వైజాగ్ సెంటర్ నుంచి 22 మంది విద్యార్థులు 99 కంటే ఎక్కువ, 106 మంది 95 కంటే ఎక్కువ, 174 మంది 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు.

విడాకులు ఇవ్వకుంటే అడ్డు తొలగించుకుంటా..

వివాహేతర సంబంధం పెట్టుకొని బెదిరిస్తున్నాడని భర్తపై భార్య ఫిర్యాదు

దొండపర్తి : మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని విడాకులు ఇవ్వకపోతే అడ్డు తొలగించుకుంటానని బెదిరిస్తున్నాడని భర్తపై భార్య నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేసింది. భర్త గండేటి సుదర్శన్‌తో పాటు వివాహేతర సంబంధం సాగిస్తున్న మహిళ కూడా తననే కాకుండా తన పిల్లలను కూడా తీవ్ర దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడిందని ఫిర్యాదులో పేర్కొంది. తనకు న్యాయం చేయాలని సీపీని కోరగా ఆయన విచారణ నిమిత్తం దిశ పోలీసులకు కేసును అప్పగించారు. ఆమె ఫిర్యాదు ప్రకారం.. పాత జైల్ రోడ్డు ప్రాంతానికి చెందిన గండేటి సుదర్శన్‌రావుకు, ఎన్ఏడీ కొత్త రోడ్డుకు చెందిన గండేటి అన్నాకుమారికు 2003లో రిజిస్టర్ వివాహం జరిగింది. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. 2007లో సుదర్శన్‌కు కువైట్‌లో ఉద్యోగం రావడంతో వెళ్లిపోయాడు. మధ్యలో వచ్చి రెండు, మూడు నెలలు ఉండి వెళ్లేవాడు. 2020 మార్చిలో అక్కడి నుంచి తిరిగి విశాఖకు వచ్చేశాడు. కొద్ది రోజుల తరువాత సుదర్శన్.. వేరే మహిళతో తరచూ అర్ధరాత్రుళ్లు కూడా మాట్లాడుతుండడాన్ని భార్య అన్నాకుమారి గమనించింది. దీనిపై భర్తను ప్రశ్నించగా.. ఓ మహిళకు ఒక పోలీస్ కేసు విషయంలో సహాయం చేస్తున్నానని చెప్పేవాడు.

అయితే భార్యకు అనుమానం వచ్చి అతని వాట్సాప్ చాట్ చూడగా.. అందులో అసభ్యకరమైన మెసేజ్‌లు కనిపించాయి. వాటిపై ప్రశ్నించగా ఆమెను దాబాయించేసి మాట దాటించేవాడు. ఫోన్లు, చాటింగ్‌లు మాత్రమే కాకుండా మద్దిలపాలెంలో ఉంటున్న మహిళ ఇంటికి వెళ్లి అక్కడే ఉండడం ప్రారంభించాడు. రాత్రుళ్లు కూడా ఇంటికి రాకపోగా.. భార్య అన్నాకుమారికి ఫోన్ చేసి తమ బంధానికి అడ్డుగా ఉన్నావని, విడాకులు ఇవ్వాలని, లేకపోతే నిన్ను ఎలా తప్పించాలో తెలుసని భార్యను బెదిరించాడు. నెల రోజుల నుంచి ఈ వేధింపులు మరింత ఎక్కువయ్యాగా, శారీరకంగా, మానసికంగా హింస్తున్నాడని, తన భర్త, వివాహేతర సంబంధం సాగిస్తున్న మహిళ నుంచి తనకు, తన పిల్లలకు ప్రాణ హాని ఉందని భార్య అన్నాకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమకు న్యాయం చేయాలని కోరింది. ఈ ఫిర్యాదుపై దిశ పోలీసులు దర్యాప్తు చేశారు. ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

కుష్టు వ్యాధిగ్రస్తులపై వివక్ష తగదు



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆనందపురం : కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నివారించడానికి అవకాశం ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కోరాడ శైలజ అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్పర్శ్ లెప్రసీ అవగాహన ప్రచారం - 2023 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 వరకూ గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టి, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కోరాడ శైలజ మాట్లాడుతూ కుష్టు వ్యాధి సోకిన వారి పట్ల వివక్ష చూపరాదని సూచించారు. అలాంటి వారు సమాజంలో గౌరవంగా బతికేలా ఆత్మస్థైర్యం నింపుతామని ఆరోగ్య సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీపీఎంవో ఎ.భీమేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఐ.గోవిందరావు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతుని కల్యాణోత్సవాలకు రూ.20 వేల విరాళం



ఈవో నానాజీ బాబుకు చెక్కు అందజేస్తున్న రవికుమార్

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో మార్చి 2 నుంచి జరగనున్న అనంత పద్మనాభుని కల్యాణోత్సవాలకు విశాఖపట్నానికి చెందిన రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రూపాకుల రవికుమార్ మంగళవారం రూ.20వేలు విరాళం ఇచ్చారు. రవి కుమార్ చెక్కు రూపంలో ఈ విరాళాన్ని ఆలయ ఈవో ఎస్.నానాజీ బాబుకు అందజేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, బీజేపీ మండల అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శులు మహంతి అప్పలరమణ, పాలూరి కృష్ణారావు, యువమోర్చా అధ్యక్షుడు హంస మహేష్ పాల్గొన్నారు.